క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

గోపవరం : వివిధ సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ సూచించారు. సోమవారం టి.సండ్రపల్లె సచివాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు తమ పరిధిలో ఉన్న కుటుంబాలకు సంబంధించి అర్హత ఉండి ఇంకా పథకాలు రాని వారు ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ దృష్టికి వచ్చిన సమస్యలకు సంబంధించి గ్రామ పంచాయతీ అనుమతితో పరిష్కరించాలని సూచించారు. అనంతరం స్పందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, పీఆర్ ఏఈ చిట్టిబాబు, డీడీఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్‌టీఎస్ సురేష్ బాబు

దువ్వూరు : మండల పరిధిలోని సంజీవరెడ్డిపల్లెలో సోమవారం సర్పంచ్ ఇరగంరెడ్డి వీరమ్మ ఆధ్వర్యంలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎస్‌టీఎస్ సురేష్ బాబు మాట్లాడుతూ చర్మంపైన పొడలు ఏర్పడి స్పర్శ లేకుంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. పరీక్షల్లో కుష్టు వ్యాధి అని నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందిస్తారని, పోషకాహారానికి నెలకు రూ.500 ప్రభుత్వం వారి ఖాతాలకు జమ చేస్తుందన్నారు. ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధికి సరైన చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేయవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ స్వర్ణ ఓబుళమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కాలేజీలో తనిఖీలు


బీఈడీ కాలేజీలో పరిశీలిస్తున్న ఈశ్వర్‌రెడ్డి

చాపాడు: మండలంలోని చిన్నగురువళూరు గ్రామంలోని శ్రీ స్వామి వివేకానంద బీఈడీ కాలేజీలో యోగి వేమన విశ్వవిద్యాలయం కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ డా.ఈశ్వర్ రెడ్డి సోమవారం తనిఖీలు చేశారు. కళాశాలలో జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షను, ప్రాక్టికల్ పరీక్ష తీరును స్వయంగా పరిశీలించారు. తెలుగులో పద్యాలు రాగయుక్తంగా చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. రాగయుక్తంగా తెలుగు పద్యాలు పాడి వాటి భావాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బీఈడీ ప్రాక్టికల్ ఎగ్జామినేషన్ పర్యవేక్షణలో భాగంగా జిల్లాలోని కళాశాలల్లో పరిశీలనలు జరుపుతున్నట్లు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంటు నాగేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సువర్ణ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి మోటార్ ఏర్పాటు


తాగునీటి మోటార్ బోరుకు పూజ చేస్తున్న ఎంపీపీ వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని రేకులకుంట పంచాయతీ టి.రామాపురం ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం సోమవారం మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తాగునీటి మోటార్ బోరుకు పూజ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ కూనపులి రాజానాయుడు, ఉప సర్పంచ్ బసిరెడ్డి, మైదుకూరు మార్కెట్‌యార్డు కమిటీ డైరెక్టర్ మన్యం శంకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి సరేష్‌బాబు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను తెలుసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ప్రజలవద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని అలాగే వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలకు, నాయకులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి రావడం కోసం ప్రతి కార్యకర్త, నాయకులు తమవంతు ప్రయత్నం చేయాలన్నారు.

ఆగస్టులో కేసీ ఆయకట్టుకు సాగునీరు


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు: రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు సహా వ్యవసాయానికి అవసరమయ్యేవన్నీ అందుబాటులో ఉంటాయని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మండలంలోని అల్లాడుపల్లెలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వ్యవసాయశాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు కోసం రూ.6లక్షలు విలువ చేసే 6 సెంట్ల స్థలం ఇచ్చిన దాతలు గ్రామానికి చెందిన గోసులు బాలిరెడ్డి కుమారులు ఎల్లారెడ్డి, బాల వీరారెడ్డి, శేషారెడ్డిలను ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, తిరుపాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాపాడు మండలంలో రూ. 10కోట్లతో రోడ్డు నిర్మాణాలు జరిగినట్లు చెప్పారు. అల్లాడుపల్లె రోడ్డును నిర్మిస్తామని చెప్పిన టీడీపీ కనీసం తట్టెడు గ్రావెల్ కూడా వేయలేదని రూ.2.50 కోట్లతో రోడ్డు నిర్మించామన్నారు. రూ.2.50 కోట్లతో చిన్నగురువళూరు–ఏటూరు రోడ్డు నిర్మించేందుకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. నక్కలదిన్నె–వెదురూరు మధ్యలో రూ.2.50 కోట్లతో వచ్చే నెలలో రోడ్డు పనులు మొదలవుతాయని చెప్పారు. నియోజకవర్గంలో పీఎంజీఎస్‌వై కింద రూ.30కోట్లతో రోడ్లను నిర్మిస్తామని తెలిపారు.

ఆగస్టులో కేసీ ఆయకట్టుకు సాగునీరు

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు ఇబ్బందులు లేకుండా ఆగస్టులో కేసీ కాలువలకు సాగునీరు వస్తుందని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. ఇప్పటికే శ్రీశైలంలో 840 అడుగుల నీటి మట్టం ఉందని, పై రాష్ట్రాల్లో వర్షాలు మొదలయ్యామని, శ్రీశైలంలో 850 అడుగులకు నీటి మట్టం చేరగానే కేసీ కాలువలకు సాగునీరు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత నాలుగేళ్లలో వచ్చిన విధంగా ఈ ఏడాది కూడా ఆగస్టు 20 నాటికి కేసీ కాలువ ద్వారా సంవృద్ధిగా సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ తెలిదేల లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వేమారెడ్డి, ఓబుళరెడ్డి, పీవీ రమణారెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, మండల వ్యవసాయాధికారి మ్యాగి, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

మైదుకూరు : మైదుకూరులోని 18వ వార్డు పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. స్థానిక నంద్యాల రోడ్డులోని వే బ్రిడ్జి సమీపంలో ఉన్న వీధిలో రూ.50లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వార్డు కౌన్సిలర్ పార్వతి, వార్డు ఇన్‌చార్జి భూమిరెడ్డి సుబ్బరాయుడు, సింగిల్ విండో చైర్మన్ మూలే సుధాకర్‌రెడ్డి, చాపాడు ఎంపీపీ లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మైదుకూరు పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, చాపాడు నాయకుడు పీవీ రమణారెడ్డి, మైదుకూరు మండల మాజీ కోఆప్షన్ బండి నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమణమ్మ

బద్వేలు అర్బన్: వర్షాకాలంలో మండల పరిధిలో ఎక్కడా కూడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షురాలు బిజివేముల రమణమ్మ అధికారులను కోరారు. సోమవారం స్థానిక ఎన్‌జీవో హోంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆయా పంచాయతీల్లో డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యగా గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. మండలంలోని కొన్ని పంచాయతీల్లో లోఓల్టేజీ సమస్య వేధిస్తోందని, అవసరమైన మేర ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం చేయాలని, ఇందుకు ఆయా పంచాయతీల సర్పంచులు సహకరించాలని కోరారు. కొన్ని గ్రామాల్లో వీధి కుళాయిలు సక్రమంగా లేక నీరు వృథాగా పోతోందని, నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను, పంచాయతీ కార్యదర్శులను కోరారు. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను ఆయా సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకురాగా వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. అనంతరం అజెండాలోని వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, మండల ఉపాధ్యక్షుడు చిన్నసుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు రామసుబ్బారెడ్డితో పాటు ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ మెంబర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే రాష్ట్రాభివృద్ధి

వేంపల్లె : కేంద్ర ప్రభుత్వ పథకాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని భారతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వి.శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం వేంపల్లెలోని స్థానిక బీజేపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి అనంతరం బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాగిశెట్టి సునీల్‌కుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలకు కేంద్రం నిధులు ఇస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్, బీజేపీ నాయకులు సుష్మా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక వసతులతో పార్కు నిర్మాణం


మున్సిపల్ గాంధీ పార్కు ఎంట్రన్స్

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గాంధీ పార్కును అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దారు. 2.53 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కును రూ.4.06 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో ఏర్పాటు చేశారు. మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, హోం శాఖ మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి గత 20న గాంధీ పార్కును ప్రారంభించారు. ఓపెన్ ఎయిర్ థియేటర్, జిమ్, చిల్డ్రన్స్ పార్కు, ఫుడ్ కోర్టు, వాకింగ్ ట్రాక్ తదితర సౌకర్యాలను కల్పించారు. దీనికితోడు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సూచన మేరకు గాంధీ పార్కులోకి సందర్శకులకు ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నారు. ఈ కారణంగా సందర్శకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. రోజు ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు ప్రవేశం కల్పించారు. రోజూ వందల మంది పార్కును సందర్శిస్తుండగా సెలవురోజుల్లో వేలాది మంది వస్తున్నారు. గాంధీ పార్కు పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.


ఓపెన్ ఎయిర్ థియేటర్


పార్కులోని వాకింగ్ ట్రాక్

దసరా ఎగ్జిబిషన్ ప్రవేశం ఉచితం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, హాజరైన కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు : దసరా ఉత్సవాల సందర్భంగా 45 రోజులపాటు నిర్వహించే ఎగ్జిబిషన్‌లో ఉచిత ప్రవేశం కల్పించడంపై మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అభ్యర్థన మేరకు దసరా సందర్భంగా ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా ప్రవేశం కల్పిస్తామని అన్నారు. ఎగ్జిబిషన్‌లోని వినోద పరికరాల కోసం ప్రత్యేకంగా రుసుంను నిర్ణయించినట్లు తెలిపారు. యథావిధిగా పార్కింగ్ ఫీజు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, కమాల్ బాషా మాట్లాడుతూ ఇంత వరకు ఎవరూ ఉచితంగా ఎగ్జిబిషన్‌లోకి ప్రవేశాన్ని ఏర్పాటు చేయలేదని, ఎమ్మెల్యే పెద్ద మనసుతో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. కౌన్సిలర్ పిట్టా బాలాజీ మాట్లాడుతూ 40 ఏళ్ల అనుభవం గల నాయకులు 14 ఏళ్లపాటు తమ పార్టీ అధికారంలో ఉన్నా నియోజకవర్గానికి వెలగబెట్టింది ఏమీ లేదన్నారు. కనీసం మున్సిపల్ నిధులను కూడా సద్వినియోగం చేసుకోలేని దుస్థితిలో గత పాలకులు ఉన్నారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అటు మున్సిపల్ నిధులు, ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సద్వినియోగం చేసుకుని నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. ఇందుకు ఎమ్మెల్యేను అభినందించాల్సిందిపోయి అవి రాష్ట్ర నిధులా, కేంద్ర నిధులా అని ప్రశ్నిస్తున్నారన్నారు. నిధులు ఏవైనా సమస్య పరిష్కారం కోసమేనన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది మున్సిపల్ కార్మికుల సమస్యలను ఇక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. సబ్బులు, యూనిఫాం, కొబ్బరి నూనె, చెప్పులు ఇవ్వలేదని గత ప్రభుత్వంలో కార్మికులు ఆందోళనలు చేసిన రోజులు ఉన్నాయని, ప్రస్తుతం వారు అడగక ముందే అన్నీ ఇస్తున్నామన్నారు. కౌన్సిలర్ ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ మైదుకూరు రోడ్డులో స్మార్ట్ స్ట్రీట్ పనులు చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ పనులకంటే ముందుగానే డ్రైనేజీ కాలువల సమస్యను పరిష్కరించాలని సూచించారు. కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యలపై పలు మార్లు అధికారులకు విన్నవించానన్నారు. కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు శివాలయం సర్కిల్‌లో టవర్ క్లాక్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం శుభ పరిణామమని తెలిపారు. టవర్ క్లాక్ పట్టణానికి ప్రత్యేక శోభనిస్తుందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పెట్రోలు బంకుల్లో విజిలెన్స్ తనిఖీలు


పెట్రోలు పంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని టీవీఆర్ పెట్రోలు బంకుతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న ఇతర పెట్రోలు బంకుల్లో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పెట్రోలు బంకుల్లోని 12 నాజిల్స్‌ను 05 లీటర్ల క్యాన్‌తో పెట్రోలును కొలత వేశారు. పెట్రోలు స్వచ్ఛత నిమిత్తం ఫిల్టర్ పేపర్ టెస్ట్ చేశారు. అలాగే డెన్సిటీ టెస్ట్‌తో పాటు పెట్రోలు బంకులో గల అండర్ గ్రౌండ్ ట్యాంకుల్లో పరిశీలన చేశారు. వాహనదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బాత్ రూంలు, తాగు నీరు, గాలిమిషన్లను పరిశీలించారు. పెట్రోలు బంకుల్లో ఉన్న లోటుపాట్ల గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. తనిఖీల్లో అధికారులు టి. రెడ్డప్ప, శ్రీనివాసులు, వి. అశోక్‌కుమార్, నాగరాజు, తారకనాథరెడ్డి, ఎం సుదర్శన్, పి సుదర్శన్‌రెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ హుండీల లెక్కింపు

వేంపల్లె : వేంపల్లెలోని పవిత్ర పాపాఘ్ని నది ఒడ్డున ఎద్దుల కొండపై వెలసిన శ్రీలక్ష్మీవృషభాచలేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించామని ఆలయ ఈఓ శ్రీధర్ తెలిపారు. శ్రీవృషభాచలేశ్వరస్వామి హుండీలు లెక్కించగా రూ.2,996లు.. అనుసంధానంలోని వేంపల్లెలోని మెయిన్ బజార్‌లోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో హుండీలు రూ. 33,764లు, కడప రోడ్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలు రూ.94, 907లు.. మొత్తం కలిపి రూ.1,31,667ల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ కె.వెంకటేష్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి


రాచాయపేటలో ఇళ్ళ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

గోపవరం : జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్ళను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ సూచించారు. సోమవారం తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ హరినారాయణతో కలిసి రాచాయపేటలో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాల్లో నాణ్యత ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ళను పూర్తి చేయించుకునేలా కాంట్రాక్టర్లతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. రుణాలు కావాలంటే ఐకేపీ ద్వారా సంబంధిత లబ్ధిదారులకు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం నిరిస్తున్న ఇళ్లే కాకుండా స్వయంగా లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లు కూడా పూర్తి చేసేలా సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణాల్లో వారం వారం పురోగతి కనిపించేలా చూడాలని సూచించారు. జగనన్న కాలనీల్లో జరుగుతున్న నిర్మాణాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి


విద్యార్థి తల్లికి నగదును అందిస్తున్న దాతలు

రాజుపాళెం : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ప్రముఖ కంటి వైద్యుడు డాక్టర్ వై.రామమునిరెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వై.చెన్నారెడ్డి, డాక్టర్ ప్రసాద్ రెడ్డి అన్నారు. రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత పది పరీక్షల్లో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేలు, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5 వేలు నగదును వారు అందించారు. అలాగే మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వెంకటరమణ రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేలంగ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి


మాట్లాడుతున్న కౌన్సిలర్ మహమ్మద్ ఆలీ

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని వార్డులలో ఉన్న ప్రజా సమస్యలపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాలని మున్సిపల్ కౌన్సిలర్లు కోరారు. సోమవారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఆయన చాంబర్‌లో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మహమ్మద్ ఆలీ మాట్లాడుతూ వార్డులలో నెలకున్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రతి సమావేశంలో అజెండాలో ఖర్చుల చిట్టాతో పాటు ప్రతిపాదనలు ఆమోదించమని పెడతారే కానీ కనీసం ప్రజా సమస్యలు ఏంత వరకు పరిష్కారమయ్యాయో అధికారులు తెలపరని అన్నారు. అధికారులు చెస్తున్న తప్పిదాలకు కౌన్సిలర్లు బాధ్యులు అవుతున్నారన్నాని చెప్పారు. మున్సిపల్ పరిధిలో పన్నుల మోత అధికంగా ఉందని విస్తీర్ణం తక్కువ ఉన్నా పన్నులు అధికంగా వేస్తున్నారన్నారు. కొలతలు వేసి పన్నులు తగ్గించమంటే అధికారులు పట్టించుకోలేదన్నారు. సమస్యల పరిష్కారాలపై దృష్టి పెడతామని కమిషనర్ పి. జగన్నాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జెబూన్నీసా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలి

చెన్నూరు : ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యాన సంచాలకులు ఎస్ఎస్‌వీ సుభాషిణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం మండలంలోని ఉప్పరపల్లికు చెందిన జగన్మోహన్ రెడ్డి అనే రైతు పంటలను పరిశీలించారు. రైతులు రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడాలని ఆమె సూచించారు. ఉత్పత్తుల సేకరణ కేంద్రం, శీతల గది ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే శాశ్వత పందిరి ఏర్పాటు చేసుకుని తీగజాతి కూరగాయలు సంవత్సరం పొడవునా సాగు చేసుకోవచ్చని, తేనె టీగల పెట్టెలను పెట్టుకోవాలని ఉద్యాన అధికారి జ్యోతీర్మయి రైతులకు తెలిపారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా డ్రోన్ తీసుకుని కషాయాలను పిచికారి చేసుకోవాలని వ్యవశాయ అధికారి శ్రీదేవి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు


కాశినాయన: ఊరేగుతున్న పీర్ల గుమ్మటాలు


పోరుమామిళ్ల : పూజాసామగ్రితో రామాయపల్లె భక్తులు

కాశినాయన : మండలంలోని నరసాపురం, గంగనపల్లె, గొంటువారిపల్లె, బాలాయపల్లె, వరికుంట్ల గ్రామాల్లో సోమవారం మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సాయంత్రం అన్ని గ్రామాల్లో పీర్లను స్నానానికితరలించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని చదివింపులు చదివించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన పీర్ల పండగ

ఖాజీపేట : ఖాజీపేట మండలం పత్తూరు గ్రామంలో పీర్ల పండుగ రెండు రోజుల పాటు వైభవంగా జరిగింది. ఏటా గ్రామంలో బక్రీద్ పండుగ సందర్భంగా పీర్ల పండుగ నిర్వహిస్తారు. ఆదివారం పీర్లను గ్రామంలో ఊరేగించారు. రాత్రి గుండాలను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం ఉదయం అగ్నిగుండంలోని నిప్పులపై గ్రామంలోని పిల్లలు పెద్దలు నడిచారు. అనంతరం పీర్లను ఊరేగించి తిరిగి వాటిని భద్రపరిచారు.

ఎమ్మెల్యే పూజలు

చాపాడు : మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామంలో మొహర్రం పండుగ ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం జారత్ పీర్ గంధోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాత్రి జరిగిన జారత్ పీర్ల వేడుకల్లో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆయన కుమారుడు, మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నాగిరెడ్డి పీర్లకు ప్రత్యేక పూజలు చేసి మత పెద్దల ఆశీస్సులు తీసుకున్నారు. అలాగే పెనుగొండ బాబా ఫకృద్దీన్ పీర్ స్వామి సమాధిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖరరెడ్డి, నాయకులు బొలేరో బాషా, షఫీ, పల్లవోలు ప్రసాద్, జైనుల్లా పాల్గొన్నారు.

రామాయపల్లె నుంచి ఉద్దికట్ట చావిడికి సానికెలు

పోరుమామిళ్ల: పోరుమామిళ్లలో మంగళవారంతో మొహర్రం వేడుకలు ముగియనున్న నేపథ్యంలో సోమవారం రాత్రి సర్కారు చావిడి వద్ద అగ్నిగుండానికి నిప్పు పెట్టారు. నాలుగురోజుల క్రితమే భారీసైజు మొద్దులు గుండంలో తోలారు. మొద్దులు బాగా ఎండి ఉండటంతో మంటలు ఎగసిపడ్డాయి. తెల్లవారు జామున పీర్లు పట్టుకున్నవారు పీర్లతో గుండంలో నడుస్తారు. వారి వెంట భక్తులు కూడా నిప్పుల గుండంలో తిరుగుతారు. పెద్దషరగత్ సందర్భంగా సోమవారం సాయంత్రం రామాయపల్లె నుంచి సానికెలు తీసుకొని ఉద్దికట్టవీధి చావిడికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చారు. ఉద్దికట్టవీధి మౌలాలి, పెద్ద పీరయ్యస్వాములకు గంధం, పూజాసామగ్రి, సానికెలు, రెండు ట్రాక్టర్లతో గుండంలోకి మొద్దులు తీసుకువచ్చారు. పిడుగు వంశస్తులు పీర్లపండుగలో దర్గాకు కావాల్సిన సరంజామ అత్యంత భక్తి ప్రపత్తులతో ఊరేగింపుగా తెచ్చి ఇచ్చారు. మహిళలు పూజాసామగ్రితో నడవగా, యువకులు నృత్యాలు చేస్తూ, చిందులు వేస్తూ, బ్యాండు మేళాలతో ముందుభాగాన నడిచారు.


పోరుమామిళ్ల : పూజాసామగ్రితో రామాయపల్లె భక్తులు

చాదర్ సమర్పణ

పోరుమామిళ్లలో జరుగుతున్న మొహర్రం సందర్భంగా సోమవారం రాత్రి ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు, పురాతన శివాలయ గౌరవ అధ్యక్షుడు తులసి సుధాకర్ సర్కారు చావిడిలో ఉన్న పీర్లకు చాదర్ సమర్పించారు. సోమవారం రాత్రి సర్కారు చావిడి పీర్లకు చెందిన ముస్లిం పెద్దలు బ్యాండు మేళాలతో సుధాకర్ కుటుంబీకులను ఊరేగింపుగా చావిడికి తీసుకుపోయారు.